# కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పనున్న జీవన్ రెడ్డి

## 25న కీలక సమావేశం రాజీనామా ప్రకటనకు సిద్ధం



**జగిత్యాల, మార్చ్ 22 (ప్రజా మంటలు):** మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడానికి సిద్ధపడ్డారు. ఈనెల 25న అభిమానులు, శ్రేయోభిలాషులతో సమావేశం నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. అదే రోజు కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయనున్నట్లు స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాలుగా కొనసాగిన అనుబంధాన్ని తెంచుకోవడం తనకు బాధాకరమని అన్నారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీలో కొనసాగడం సాధ్యం కాదని అభిప్రాయానికి వచ్చినట్లు చెప్పారు. 20 నెలలుగా జగిత్యాలలో జరుగుతున్న పరిణామాలు తనను తీవ్ర అసంతృప్తికి గురిచేశాయని, తన సమస్యలకు పరిష్కారం లభించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్‌లో ఫిరాయింపు నేతలు పార్టీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం పెరిగిందని, నిజమైన కార్యకర్తల హక్కులు కాలరాస్తున్నాయని విమర్శించారు. శాసన మండలిలో ప్రజల సమస్యలపై ఒంటరి పోరాటం చేశానని, అధికారంలో ఉన్నప్పటికీ ప్రజల పక్షాన నిలబడ్డానని జీవన్ రెడ్డి గుర్తుచేశారు. గతంలో రైతుల ప్రోత్సాహకాలు, అదనపు విద్యుత్ బిల్లుల ఉపసంహరణ కోసం కూడా ఉద్యమాలు చేసినట్లు తెలిపారు. రాజకీయాల్లో గౌరవం ముఖ్యమని, అది లేకపోతే పార్టీలో కొనసాగడం వలన ప్రయోజనం లేదని అన్నారు. సొంత పార్టీలోనే పోరాటం చేయాల్సి రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణహిత నది నీటి వినియోగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణం ఆలస్యం ఉత్తర తెలంగాణపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. మేడిగడ్డ పునరుద్ధరణపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తనకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర నాయకత్వం స్పందించలేదని, శ్రీధర్ బాబుతో చర్చించినా పరిష్కారం దొరకలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య హక్కుల మేరకు నిర్ణయం తీసుకుంటున్నానని స్పష్టం చేశారు. జగిత్యాల ప్రజలతో తన అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని, చివరి శ్వాస వరకు ప్రజల మధ్యనే ఉంటానని జీవన్ రెడ్డి అన్నారు.

## కార్యదర్శి అనంతరెడ్డికి ఘన వీడ్కోలు



**భీమదేవరపల్లి మార్చి 22 (ప్రజా మంటలు) :** మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి పాకాల అనంత రెడ్డి డిప్యూటేషన్‌పై బదిలీ కావడంతో ఆదివారం ఆయనకు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మండల సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు కార్యదర్శి అనంతరెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, అనంతరెడ్డి గ్రామ అభివృద్ధికి కృషి చేసి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. కొత్త బాధ్యతల్లో కూడా మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శిఖ ప్రదీప్, బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు పోలు మహేందర్, మహిళా అధ్యక్షురాలు కాసగోని మానస, మ్యాకల సమ్మయ్య, రాగం రమేష్, రేణుకుంట్ల శ్రీనాథ్, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా సబ్ జైలులో రిమాండ్ ఖైదీకి అస్వస్థత



**జగిత్యాల, మార్చ్ 22 (ప్రజా మంటలు):** కోరుట్ల మండలం మాదాపూర్‌లో యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో నిందితుడైన భర్త హరిబాబు, జగిత్యాల సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సమయంలో ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వెంటనే స్పందించిన జైలు అధికారులు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం హరిబాబు క్రిటికల్ కేర్‌లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పైలెట్ ప్రాజెక్టుగా మహిళా సంఘాలకు భవనాలు శంకుస్థాపన

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**గొల్లపల్లి మార్చ్ 22ప్రజా మంటలు :** బుగ్గారం మండలం లోని ప్రభుత్వ భవనాల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఏలాంటి రాజీ పడవద్దని అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం బుగ్గారం మండలం పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. బుగ్గారంలో రూ.25 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు, రూ.10 లక్షలతో నిర్మించే మహిళా సంఘాల వీవో భవనానికి శంకుస్థాపన చేశారు. మండలంలోని వెల్గొండ గ్రామంలో రూ. 5 లక్షలతో చేపట్టి డ్రైనేజీ పనులు, రూ. 15 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం, రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపనలు చేశారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల అవసరాల కోసం నిర్మించే నిర్మాణాలలో నాణ్యత లో ఏలాంటి రాజీ లేకుండా కాంట్రాక్టర్ ద్వారా పని చేయించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. భవన నిర్మాణాలు సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో మహిళా సంఘాలకు కావలసిన వీవో భవనాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని నిర్మాణాలు పూర్తి చేయాలని మంత్రి సూచించారు. వీవో భవనాల్లో కావలసిన మౌలిక సదుపాయాలకు అవసరమైతే అదనపు నిధులు ఇస్తామని మంత్రి తెలిపారు బుగ్గారం మండల కేంద్రంలో నక్క లక్ష్మికి మంజూరైన ఇందిరమ్మ ఇంటిని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. నిరుపేదల సొంతింటి కలలను కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తుందని మంత్రి అన్నారు. నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇళ్ల ను త్వరితగతిన పూర్తి చేస్తామని మంత్రి అన్నారు. వెలుగొండ గ్రామ పర్యటన కు వచ్చిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ఎదురుగా వచ్చిన దివ్యాంగుడు శాఖపురం శ్రీనివాస్ తో మంత్రి మాట్లాడారు.. కొత్త ట్రై సైకిల్ ఇప్పిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. శ్రీనివాస కు పెన్షన్ వస్తున్న విషయంపై ఆరాతీసిన మంత్రి లక్ష్మణ్ కుమార్ వెంటనే వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని సంబంధిత ఎంపీడీవోను ఆదేశించారు ఈ కార్యక్రమంలో బుగ్గార మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్, సర్పంచులు ఉపసర్పంచ్లు, నాయకులు నగునూరు నర్సాగౌడ్, బండారు మహేష్, మహిళా సంఘాల వివోలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ భూమి పూజ



**భీమదేవరపల్లి, మార్చి 22 (ప్రజా మంటలు) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ స్థాపన కోసం ఆదివారం భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, యువకులు, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ చరిత్రలో మహోన్నత యోధుడిగా నిలిచారని, ఆయన సేవలు, త్యాగాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. యువత ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పూదరి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# ప్రతి నీటి బొట్టును వీరు ఒడిసిపట్టుకొని, కాపాడుకుంటున్నారు

## 90 ప్లాట్స్ లోని 3 వేల మంది

## సంకల్పంతో నీటి కరువు పరార్..

## నీటి ట్యాంకర్లకు గుడ్ బై...27 ఇంకుడు

## గుంతలతో పెరిగిన భూగర్బజలాలు

## నగరానికి ఆదర్శంగా బోయిగూడ

## ఎంఎన్కే అపార్ట్ మెంట్ వాసులు






**సికింద్రాబాద్, మార్చి 22 ( ప్రజా మంటలు) :** భూమ్మీద నీరు విస్తారంగా ఉన్నప్పటికీ, తాగునీటి కొరత మాత్రం రోజురోజుకు తీవ్రమవుతోంది. ప్రతి వేసవిలో నగరాల్లో నీటి కోసం ప్రజలు పడే ఇబ్బందులు అందరికీ తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో నీటి సంరక్షణ ఎంతో ముఖ్యమని గుర్తించిన హైదరాబాద్ నగరంలోని సికింద్రాబాద్ బోయగూడ ప్రాంతంలోని అపార్ట్ మెంట్ వాసులు ఆదర్శంగా నిలుస్తున్నారు. బోయగూడలోని ఎంఎన్కే సెంట్రల్ కోర్టు అపార్ట్‌మెంట్ వాసులు నీటి ప్రతి బొట్టును విలువైనదిగా భావిస్తూ వినూత్న చర్యలు చేపట్టారు. ఆరు వేల గజాల విస్తీర్ణంలోని మొత్తం 90 ఫ్లాట్లు ఉన్న ఈ అపార్ట్‌మెంట్‌లో సుమారు 3,000 మంది నివసిస్తున్నారు. గతంలో ప్రతి వేసవిలో నీటి ట్యాంకర్ల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అపార్ట్‌మెంట్ వాసులు కలిసి 2014 సంవత్సరంలో ఏడు ఫీట్ల లోతుతో గ్రౌండ్ ఫ్లోర్ లో చిన్న ఇంకుడు గుంతలు 23, సెల్లార్ లో 20 ఫీట్ల లోతుతో పెద్దవి రెండు, మెయిన్ గేట్ ఎంట్రన్స్ లో 200 ఫీట్ల లోతుతో రెండు ఇంజక్షన్ బోర్ ఇంకుడు గుంతలు మొత్తం 27 వర్షపు నీటి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకున్నారు. వర్షపు నీటిని భూమిలోకి చొప్పించి భూగర్భ జలాలను పెంచే విధంగా ఈ ఏర్పాట్లు చేశారు. ఫలితంగా 500 ఫీట్ల లోతున నీరు ఉన్న వీరి మూడు బోర్లు ఎండిపోవడం తగ్గి, వేసవిలో కూడా తగినంత నీరు 200 ఫీట్ల లోతులోనే అందుబాటులోకి వచ్చింది. ఇంకుడు గుంతల వల్ల ట్యాంకర్లపై ఆధారపడే అవసరం దాదాపు లేకుండా పోయింది. నీటి కోసం ఖర్చయ్యే డబ్బు ఆదా కావడంతో పాటు, పర్యావరణ పరిరక్షణలో కూడా ఈ అపార్ట్‌మెంట్ వాసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ జీ హనుమాన్లు మాట్లాడుతూ"ప్రతి ఒక్కరూ నీటి విలువను గుర్తించి సంరక్షణ చర్యలు తీసుకుంటేనే భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించగలం" అని తెలిపారు. ఈ ప్రపంచ జల దినోత్సవం నాడు బోయగూడ ఎంఎన్కే అపార్ట్‌మెంట్ వాసుల ప్రయత్నం మనందరికీ స్ఫూర్తిదాయకం. ప్రతి ఇంటి, ప్రతి కాలనీ ఈ విధమైన చర్యలు తీసుకుంటే నీటి సమస్యను



గణనీయంగా తగ్గించవచ్చని అపార్ట్ మెంట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వీ.శ్రీనివాసన్, సెక్రటరీ సేతు మాధవరావు, మెంబర్లు రంగనాయకమ్మ, రామేశ్వర్ లు అన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శించుకున్న మంత్రి అడ్లూరి



**గొల్లపల్లి మార్చ్ 22ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలంలోని వెనుగుమట్ల - బొంకూర్ రెండు గ్రామాలకు అనుసంధానమైన శ్రీ వెంకటేశ్వర స్వామి ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు పూర్ణ కుంభంతో మంత్రి కి స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని మంత్రి ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఈనెల 23 నుండి 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు ఈ కార్యక్రమం లో మార్కెట్ చేర్మెన్ బీమా సంతోష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, రెండు గ్రామాల సర్పంచులు బొంకూర్ ముల్కల శిరీష, నక్క స్రవంతి, ఉపసర్పంచులు వార్డ్ సభ్యులు పురప్రముఖులు గ్రామ పెద్దలు యువకులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెనుగుమట్ల గ్రామంలో ఆప్యాయంగా అక్క అన్న ఏట్లా ఉన్నారు

### స్థానికులను పలకరించిన మంత్రి అడ్లూరి

### వార్డు సమస్యల్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లిన గ్రామస్తులు



**గొల్లపల్లి మార్చ్ 22ప్రజా మంటలు :** ఎండాకాలంలో సూర్య తాపానికి చెట్ల నీడన కూర్చొని సేద తీరుతున్నారు గ్రామస్తులు.. చెట్ల కింద సేద తీరుతున్న వారిని చూసి అటుగా వెళుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వాహన శ్రేణి ఒక్కసారిగా నిలిచిపోయింది.. వాహనంలో నుంచి దిగిన మంత్రి అడ్లూరి అక్క ఎట్లున్నావ్.. అన్న ఎట్లున్నావ్.. అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అపాయ్యంగా పలకరించారు.. మంత్రి ని చూసిన గ్రామస్తులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు మంత్రి సామాన్యులను చూసి వాహనం నిలిపి మంత్రి మందలించడంతో సంతోషం వ్యక్తం చేశారు..అయితే సాక్షాత్తు మంత్రి తమ కళ్ళ ముందు కనిపించడంతో తమ వార్డు సమస్యలను మంత్రికి వివరించారు. వార్డులో సీసీ రోడ్డు నిర్మాణం తో పాటు కరెంటు పోల్స్ కావాలని మంత్రికి వివరించారు. వార్డు సమస్యలపై స్పందించిన మంత్రి వెంటనే నిధులు మంజూరు చేసి సీసీ రోడ్డు నిర్మాణం, నూతన కరెంటు పోల్స్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి హామీతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

## అయిల్ ఫామ్ ఫ్యాక్టరీ తీసుకువచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వదే

### పాలాభిషేకం కార్యక్రమం



**హుస్నాబాద్, మార్చి 22 (ప్రజా మంటలు):** సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మేట గ్రామంలో దేశంలోనే అతిపెద్ద ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ చిత్రపటాలకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రూ.300 కోట్ల వ్యయంతో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి, రైతుల ఆర్థికాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ముఖ్యంగా హరీష్ రావు పట్టుదలతో ఈ ప్రాజెక్టు సాధ్యమైందని, జిల్లా వ్యాప్తంగా సుమారు 12 వేల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ పంట సాగుకు రైతులను ప్రోత్సహించారని తెలిపారు. రైతులకు అవగాహన కల్పిస్తూ గ్రామ గ్రామాన ప్రచారం చేసి ఆయిల్ ఫామ్ సాగు విస్తరించడంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. కేసీఆర్, హరీష్ రావు రైతుల కోసం చేసిన సేవలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సూద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున రెడ్డి, ఎమ్.ఎ. అన్వర్ పాషా, గాదపాక రవీందర్, గడిపే సంపత్, బీలు నాయక్, సూరంపల్లి పరశురాములు, కన్నోజు రామకృష్ణ, కొంకట రవీందర్, ఇంద్రాల సారయ్య, యాస శ్రీనివాస్, కాశపోబోయిన శీను, మేకల వికాస్ యాదవ్, సిదిరాల శ్రీనివాస్, జీవన్ నర్సింహా రెడ్డి, గోపాగోని అరవింద్ గౌడ్, బూర వెంకన్న గౌడ్, గూగులోతు తిరుపతి నాయక్, పూదరి రవీందర్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కాశిరెడ్డి ఆదిరెడ్డికి ఘన సన్మానం



**భీమదేవరపల్లి, మార్చి 22 (ప్రజా మంటలు):** మండలంలోని ముల్కనూర్ ఎస్ఆర్‌కే స్కూల్ అధినేత, హనుమకొండ హడుప్స్ జిల్లా ఉపాధ్యక్షులు కాశిరెడ్డి ఆదిరెడ్డి ఇటీవల భీమదేవరపల్లి మండల సాక్షి రిపోర్టర్‌గా నియామకం కావడంతో ముత్తారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి, కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు ఊరడి మహేందర్ రెడ్డి, కార్యదర్శి ఏనుగు మధు, మాజీ అధ్యక్షుడు ఏనుగు శంకర్ రెడ్డి, మాజీ కార్యదర్శి ఏనుగు ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆదిరెడ్డి పాత్రికేయ రంగంలో మరింత ఎదిగి ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. కాశిరెడ్డి ఆదిరెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి సన్మానం చేసిన రెడ్డి సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిష్పక్షపాతంగా పనిచేస్తానని తెలిపారు.

## రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయదానికే రైతు భరోసా పథకం

### నర్మేట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంబోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్,మార్చి 22,(ప్రజా మంటలు):** సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో నిర్వహించిన "రైతు ఉత్సవాలు" కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ టీజీ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం, రైతు భరోసా నిధుల విడుదల, రిఫైనరీతో పాటు పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం రాష్ట్ర అభివృద్ధికి ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ఈ కార్యక్రమాలు రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచేందుకు దోహదపడతాయి. రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రి నిబద్ధత మరోసారి స్పష్టమైంది. రైతు భరోసా వంటి పథకాల ద్వారా రైతులకు భరోసా కల్పిస్తూ, వారి జీవితాల్లో స్థిరత్వాన్ని తీసుకురావడం అభినందనీయం. రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే ఈ విధానాలకు మా పూర్తి మద్దతు ఉంటుందని తెలియజేస్తున్నాను. తెలంగాణ రైతాంగానికి మేలు చేసే ఈ కార్యక్రమాలు మరింత విస్తరించి, ప్రతి రైతు కుటుంబానికి లబ్ధి చేకూరాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## అనాథలకు అండగా స్కై ఫౌండేషన్ 297వ అన్నదానం



**సికింద్రాబాద్,మార్చి 22 (ప్రజామంటలు):** నగరంలో ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులు, సంచారజాతుల కుటుంబాలకు అండగా స్కై ఫౌండేషన్ పనిచేస్తోంది. సంస్థ ఆధ్వర్యంలో 297వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి, అవసరమైన వారికి ఆహారం అందజేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహనంలో సంచరిస్తూ నిజంగా అవసరమైన వారిని గుర్తించి వారికి భోజనం అందించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. నిరుపేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా నిరంతరం కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని, సభ్యులు అఖిల్, హరీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సంజీవ్ కుమార్, పావని మాట్లాడుతూ.. సమాజంలో ఎవరూ ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు.

## వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్పించిన పోలీసులు




**సికింద్రాబాద్,మార్చి22 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒంటరిగా సంచరిస్తున్న ఓ వృద్ధురాలిని పోలీసులు అండగా నిలిచి,ఆశ్రమంలో చేర్పించారు. రియల్ వివేక్ ఫౌండేషన్ నిర్వాహకుడు అంబులెన్స్ శ్రీనివాస్ గుప్తా తెలిపిన వివరాలు ...చిలకలగూడ పీఎస్ పరిధిలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని గుర్తించిన పోలీసులు వెంటనే ఫౌండేషన్ వాహనంలో బోయిగూడ లోని మిషనరీ ఆఫ్ ఛారిటబుల్ ఆఫ్ ట్రస్ట్ ఆశ్రమానికి తీసుకెళ్ళి, అందులో చేర్పించారు. తనకు ఆశ్రయం కల్పించిన పోలీస్ సిబ్బంది, ఫౌండేషన్ శ్రీనివాస్ గుప్తాకు వృద్ధురాలు కృతజ్ఞతలు చెప్పింది.

